# కర్మయే నరునకు దైవం

కర్మమున పుట్టు మనుజుడు
కర్మముననె వృద్ధి పొంది కర్మమున చనున్
కర్మమె నరునకు దైవము
కర్మమె సుఖదుఃఖములకు కారణమిలలో!

కర్మమనగా మనము చేసే పని. కర్మమువల్లనే మానవుడు జన్మిస్తున్నాడు, వృద్ధి పొందుతున్నాడు, చివరికి మరణిస్తున్నాడు. చావు, పుట్టుకలు రెండూ కర్మము చేతనే జరుగుచున్నవి. కర్మయే చేయకుండిన మానవత్వము నిలువదు. మానవ జీవితానికి కర్మమే ఆధారం. యజ్ఞయాగాది క్రతువులన్నియు కర్మకాండకు సంబంధించినవే. ఈ కర్మలే జరుగకుండిన జగత్కల్యాణం జరుగదు. కర్మము పైననే ఈ జగత్తంతయు ఆధారపడి ఉన్నది. కనుక, ప్రతి మానవుడుకూడను తన కర్తవ్య కర్మలను తాను ఆచరిస్తూ, తనలో ఉన్నటువంటి దివ్యత్వమును దర్శించాలి. ఎట్టి కర్మయో అట్టి ఫలితము. కర్మఫలితమును ఎవరైనను సరే అనుభవించక తప్పదు. కర్మలనగా దేహములోని వివిధ అంగములచేత ఆచరించునవి మాత్రమే కాదు. మన ఉచ్ఛ్వాస నిశ్వాసములుకూడను కర్మలే. తినటం, త్రాగటం, నడవటం, కూర్చోవటం ... ఇవన్నీకూడను కర్మలే. కనుకనే, ఏ కర్మయొక్క ఫలితము ఎలా ఉంటుందో ఎవ్వరూ చెప్పలేరు. మనము కర్మను ఆచరించే ముందు, 'నేను మానవుడను. ఇది మానవుడు ఆచరించదగిన కర్మయేనా? కాదా?' అని విచారించాలి. అట్లు విచారించకుండా కర్మలనాచరించిన, ఆశించిన ఫలితాన్ని అందుకోలేము.

ప్రేమస్వరూపులారా! కర్మయే నరునకు దైవము. దైవమనగా ఎక్కడో ప్రత్యేకంగా లేదు; మీరు చేసే ప్రతి కర్మయందుకూడను తాను సూక్ష్మస్వరూపుడై ఉన్నాడు. అణువు మొదలు ఘనమువరకుకూడను దైవము కర్మస్వరూపుడై వ్యాపించి ఉన్నాడు. కనుకనే వేదము,

sri sathyasai vachenamrutam

'అణోరణీయాన్ మహతో మహీయాన్' అన్నది. ప్రతి మానవుడుకూడను నిత్యమూ కర్మలనాచరిస్తూనే ఉన్నాడు. అయితే, ప్రతి కర్మను భగవదర్పిత భావంతో ఆచరించాలి. 'సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థం' అనే భావంతో చేసినప్పుడు కర్మలయొక్క ఫలితము మనకు ఏమాత్రము అంటదు.

'ఈశ్వరస్సర్వ భూతానాం'. ఈశ్వరుడు సర్వ భూతములయందు ఉంటున్నాడు; పాములో ఉన్నాడు, తేలులో ఉన్నాడు, మానవునియందుకూడను ఉన్నాడు. ఏ దేహమునందు ఉంటే ఆ దేహమునకు తగిన కర్మలను తాను ఆచరించాలి. ఇట్టి భగవత్తత్త్వాన్ని అర్థం చేసుకోలేక అనవసరమైన భావములతో మీ మనస్సును పాడుచేసుకోకూడదు. మానవుడు తనకు తెలియని విషయములో ప్రవేశించ కూడదు; తెలిసినప్పుడే దానియందు ప్రవేశించాలి. కాని, ఈనాటి మానవుడు తెలిసీ తెలియక అన్నింటియందూ ప్రవేశిస్తున్నాడు. కనుకనే, తాను అనేక రకములైన బాధలకు గురి అవుతున్నాడు. స్త్రీలుగాని, పురుషులుగాని ఎవరికి తగిన కర్మలను వారు ఆచరిస్తూ రావాలి.

**బాల్యంబునందున పలువురితోకూడి**
**ఆటపాటలయందు ఐక్యుడగును**
**యవ్వనంబలరిన అలరువిల్తుని పోల్కి**
**కామినీ లోలుడై క్రాలుచుండు**
**అర్థ వయస్సున ఐహికంబున మున్గి**
**ద్రవ్యమార్జించుట దవిలియుండు**
**ముదిమి వచ్చినయంత మురహరి తలవక**
**అది ఇది లేదని అలమటించు**
**వివిధ దుర్వ్యసనంబులు వీడలేక**
**భక్తిమార్గంబు వెతుక ఆసక్తి లేక**
**కర్మపంకిలమున పడి క్రాలుచుండు**
**మట్టి కల్పును జన్మంబు మానవుండు**

sri sathyasaivachanamrutam

ఇది సరియైనది కాదు. పుట్టినది మొదలు గిట్టునంతవరకు మానవుడు మానవుడుగా జీవించాలి. మానవత్వ మనగా దివ్యత్వముతో కూడినది. నేడు మీరు స్టూడెంట్సుగా ఉన్నారు. తరువాత గృహస్థాశ్రమంలో ప్రవేశిస్తారు. మీ బాల్యమును, యౌవనమును ఆటపాటలతోను, ధనసంపాదనతోను గడిపివేసి ముసలితనంలో సహితం మురహరిని తలవక 'అది లేదు, ఇది లేదు' అని అశాంతితో కుమిలిపోతే వచ్చే ప్రయోజనమేమిటి! ఇప్పటినుండియే మీరు తగిన విచారణ సల్పి జాగ్రత్తగా నడుచుకోవాలి. యువకుల కర్తవ్యమేమిటో బోధించ వలసిందని వినయ్ (కర్ణాటక సాయి యువత అధ్యక్షుడు) ప్రార్థించాడు. యువకులు యువకులుగానే ఉండాలి. వారెప్పుడుకూడను వృద్ధులు కాకూడదు. ఎప్పుడు మన ఇంద్రియముల శక్తిని పాడుచేసుకుంటామో అప్పుడే మనము వృద్ధుల మవుతాము. ఆ 'ఎనర్జీ'ని మనము కాపాడుకోవాలి.

**నాకు చెడ్డ అన్నదే కనిపించదు**

ఇప్పుడు ఈ దేహమునకు 81 సంవత్సరములు. కాని, ఆవిధంగా నేను కనిపిస్తున్నానా? నా దేహమున కెట్టి రోగములూ లేవు. ఒక పిల్లవాడు మీద పడేసరికి నా తుంటి ఎముక విరిగిపోయింది. డాక్టర్లు ఆపరేషను చేశారు. నేను ఇంట్లో మామూలుగా నడుస్తూనే ఉన్నాను. కాని, బయటికి వచ్చినప్పుడు డాక్టర్లు, "స్వామీ! మీరు జనంలో తిరిగేటప్పుడు ఒంటరిగా తిరుగకండి. ఎవరినైనా ఒకరిని పట్టుకొని నడవండి" అని సలహా ఇచ్చారు. వారి సలహానుకూడా నేను పాటించాలి. కనుకనే, వారి తృప్తి నిమిత్తమై నేను ఒకరిని పట్టుకొని నడుస్తున్నాను. "నన్ను పట్టుకోవద్దు, పట్టుకోవద్దు", అని పిల్లలకుకూడా నేను చెపుతూనే ఉంటాను. ఎవ్వరికీ తెలియదు. ఈవిధంగా నేను ప్రతి విషయంలో అతిసూక్ష్మ దృష్టితో నడుచుకుంటాను. నా తత్త్వమును ఎవ్వరుకూడను అర్థం చేసుకోవడం లేదు. నాకు జ్వరము, తలనొప్పి, జలుబు ఇలాంటివి ఎప్పుడూ రాలేదు. నేనెప్పుడుకూడను healthyగా ఉంటాను. Healthy గా మాత్రమే కాదు, wealthyగా కూడా ఉంటాను. ప్రతి విషయమునూ నేను చక్కగా గమనిస్తాను. కొంతమంది ఋత్విక్కులుకూడను ఇక్కడ కూర్చొని మాట్లాడుతుంటారు. ఇవన్నీ నేను వింటూనే ఉంటాను. మంచిగాని, చెడ్డగాని రెండూ నాకు సమానమే. నాకు చెడ్డ అన్నదే కనిపించదు. నాకన్నీ మంచివే. ఈనాడు

sri sathyasai vachanamrutam

పంచభక్ష్య పరమాన్నములతో మనము మంచి భోజనము చేయవచ్చును. కాని, ఎంతవరకు అది మంచిది? రేపటి ఉదయానికల్లా అది మరోవిధంగా మారిపోతుంది. కనుక, మంచి చెడ్డలు రెండుకూడను ఒకే పదార్థమునందు difference of time (కాలమార్పు) చేత ఏర్పడే పరిణామములే! కనుక, మనం ప్రతి విషయాన్ని కూడను జాగ్రత్తగా గుర్తించి వర్తించాలి.

**తల్లిదండ్రుల మాటలను అలక్ష్యం చేయకూడదు**

మహాభారతయుద్ధంలో దుర్యోధన దుశ్శాసనాదులు ఎంతగా ప్రయత్నించి నప్పటికీ పాండవులను జయించలేకపోయారు. కారణం? కృష్ణుడు పాండవుల వైపు ఉన్నాడు. యుద్ధసమయంలో ఒకనాడు అభిమన్యుడు ఇంటివద్ద ఒంటరిగా ఉండటం గమనించి ద్రోణుడు పద్మవ్యూహమును పన్ని, అతనిని యుద్ధానికి రమ్మని పిలిచాడు. అభిమన్యుని తండ్రి అర్జునుడు, మామయైన కృష్ణుడు మరోవైపున యుద్ధానికి వెళ్ళారు. అభిమన్యుడు తన తల్లియైన సుభద్ర దగ్గరకు వెళ్ళి పద్మవ్యూహంలో ప్రవేశించడానికి తనకు అనుజ్ఞ ఇవ్వవలసిందిగా కోరాడు. అప్పుడామె, "నాయనా! పద్మవ్యూహమును భేదించడం సామాన్యమైన విషయం కాదు. అందులో ప్రవేశించుటకు ఇది శుభ సమయం కాదు. కాబట్టి, నీవు ఈ ఆలోచనను విరమించుకో", అని కోరింది.

**"తామర మొగ్గరంబు, బలదర్పిత శాత్రవ గర్వభంజనో**
**ద్దాముడు కుంభజుండు మరి దానిని పన్నినవాడు, భీష్మ సం**
**గ్రామము, భార్య గర్భవతి, కాలమెటుండునొ చెప్పలేము, నీ**
**మామయు తండ్రి లేరిచట మానుము నీ తలపింక పుత్రకా!"**

అని ప్రాధేయపడింది. తల్లి మాటలు విని అభిమన్యునికి చాలా కోపం వచ్చింది. "నేను మహావీరుడైన అర్జునుని కుమారుడను. శత్రువులు వచ్చి యుద్ధానికి రమ్మని పిలుస్తుంటే రానని చెప్పడం క్షత్రియ ధర్మము కాదు. నేను వెళ్లకపోతే నా తండ్రికి అపకీర్తి తెచ్చినవాడనవుతాను. నా ప్రాణం పోయినా నష్టం లేదు. కాని, నేను యుద్ధానికి వెళ్ళితీరవలసిందే", అన్నాడు.

srisathyasaivachanamrutam

**"వెఱవక కుంభజాది కురువీరులపై మృగరాజువోలె నే**
**నుఱుకుచు చండఖండనికరోన్నత దివ్యమహాస్త్రపంక్తి నిం**
**బఱపుచు గెల్చునప్పుడిటు భద్రము నీకగునంచు పల్కకీ**
**తెఱగున పోకుపోకు మని తీవ్రత నాపుట నీకు పాడియా!"**

అని అభిమన్యుడు పలికేసరికి తల్లి చేయునది లేక అతని నుదుట వీర తిలకము దిద్ది ఆశీర్వదించింది.

**"తారకాసురుని దోర్దర్ప మణచువేళ**
**గౌరి తనయు కిడ్డ వీర రక్ష**
**శంబరాసురుని జంపగా చనువేళ**
**భార్గవి సుతు కిడ్డ భవ్య రక్ష**
**మాతృదాసీత్వము మాన్ప నురుకు వేళ**
**వినత పుత్రు కిడ్డ విమల రక్ష**
**కౌశికు యాగంబు గావ వనికి నేగెడు వేళ**
**తల్లి రఘువు కిడ్డ ధర్మ రక్ష**
**అట్టి శ్రీరక్ష ఘనరక్ష యజ్ఞరక్ష**
**రక్షలందున దివ్యమౌ శ్రీరామరక్ష**
**తోడునీడయై నిన్ను కాపాడుగాక!"**

అని ఆశీర్వదించి కుమారుణ్ణి యుద్ధానికి పంపించింది. తల్లి ఆశీస్సులనందుకొని అభిమన్యుడు పద్మవ్యూహంలో ప్రవేశించాడు. అతనికి ప్రవేశించటం మాత్రమే తెలుసుకాని, వెలుపలికి వచ్చే విధానం తెలియదు. దీనికొక కారణమున్నది. సుభద్ర గర్భవతిగా ఉన్న సమయంలో ఒకనాడు అర్జునుడు ఆమెకు పద్మవ్యూహమునుగురించి చెపుతూ వచ్చాడు. అతను చెపుతున్నదానికి సుభద్ర ఊకొడుతూ వచ్చింది గాని, అదంతా ఆమె గర్భములో ఉన్న అభిమన్యుడు విన్నాడు. ఇంతలో కృష్ణుడు అక్కడికి వచ్చి, "అర్జునా! నువ్వు చెప్పేదంతా సుభద్ర వింటున్నదని అనుకుంటున్నావా? కాదు, కాదు. ఆమె గర్భములో ఉన్నటువంటి బిడ్డ వింటున్నాడు. కాబట్టి, ఇక నీవు పద్మవ్యూహముగురించి మాట్లాడవద్దు", అన్నాడు.

srisathyasaivachanamrutam

అప్పటికి పద్మవ్యూహంలో ప్రవేశించే విధానం చెప్పడం పూర్తయింది. అందువల్లనే, అభిమన్యుడు పద్మవ్యూహంలోకి ప్రవేశించగలిగాడుకాని, బయటికి వచ్చే విధానం తెలియక ప్రాణాలు కోల్పోయాడు. కాబట్టి, తల్లిదండ్రుల మాటలను మనము ఎన్నడూ పెడచెవినపెట్టకూడదు. పెద్దలు చెప్పిన విషయాలను చెవులతో విని, మనస్సులో మననం చేసి, ఆచరణలో పెట్టి జీర్ణించుకోవాలి. ఆవిధముగా మనము విన్నటువంటి విషయములయొక్క సారమును దేహములోని సర్వాంగములకు సప్లై చేయాలి. "మాతృదేవో భవ, పితృదేవో భవ" అనునది వేదప్రమాణము. కనుకనే, మనము తల్లిదండ్రుల మాటలను ఏనాడూ అలక్ష్యం చేయకూడదు. ఎట్టి విషయమునందైనను, ఎటువంటి పరిస్థితియందైనను వారి ఆజ్ఞను శిరసావహించాలి.

**భగవంతుని 'టెస్టు'లన్నీ చక్కని 'టేస్టు'తో కూడినవే!**

కృష్ణార్జునులు యుద్ధభూమినుండి ఇంటికి తిరిగి వచ్చారు. కాని, వచ్చిన వెంటనే అభిమన్యుడు తనకు ఎదురురాకపోయేసరికి అర్జునుడు ఆందోళన చెందాడు. 'నా రాక ఎరిగినంతనె పరుగెత్తుకొని వచ్చి నన్ను కౌగిట చేర్చుకుంటాడు. అట్టి నా ప్రియ కుమారుడు ఏలకో నేడు రాకయున్నాడు', అని పరిపరి విధాలుగా చింతిస్తూ వచ్చాడు. అభిమన్యుడు పద్మవ్యూహంలో ప్రవేశించి కౌరవుల చేతిలో ప్రాణాలు కోల్పోయాడని తెలుసుకొని అర్జునుడు దుఃఖంలో మునిగిపోయాడు. అప్పుడు కృష్ణుడు అర్జునుని ఓదార్చుతూ, 'అర్జునా! కౌరవుల కుయుక్తులవల్ల మీరెన్నో కష్టాల ననుభవించారు. వారు చేసిన మోసంవల్లనే ఇప్పుడు నీ కుమారుడు మరణించాడు. జరిగిందేదో జరిగిపోయింది. నీవు బలహీనతకు చోటివ్వకు', అన్నాడు. అర్జునునికి చాలా కోపం వచ్చింది. 'కృష్ణా! నా కుమారుడు మరణించే విషయం నాకు ముందే చెప్పకూడదా? నువ్వుకూడా నన్ను మోసం చేశావు. ఇదంతా నీవల్లనే జరిగింది', అని నిందించాడు. అర్జునుని మాటలకు కృష్ణుడు కోపం తెచ్చుకోలేదు. కృష్ణుడు ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ ఉండేవాడు. అది అతని స్వభావం.

కొన్ని నెలల తరువాత అభిమన్యుని భార్య ఉత్తర ప్రసవించింది. కాని, ఆమెకు మరణించిన కుమారుడు పుట్టాడు. అశ్వత్థామ బ్రహ్మాస్త్రమును ప్రయోగించి ఆమె గర్భములో ఉండగనే శిశువును హతమార్చాడు. పాండవులు క్రుంగిపోయారు. అందరూ

srisathyasaivachanamrutham

ఖిన్నవదనులై ఒక గదిలో కూర్చున్నారు. అంతకు పూర్వమే అశ్వత్థామ ద్రౌపది పుత్రులైన ఉపపాండవులను హతమార్చాడు. సుభద్ర కుమారుడైన అభిమన్యుడు పద్మవ్యూహంలో చిక్కుకొని ప్రాణం కోల్పోయాడు. ఇప్పుడు ఉత్తరకు పుట్టిన కుమారునిలో కూడా ప్రాణం లేదు. ఇక, పాండవ వంశమును నిలబెట్ట గలవారు ఎవ్వరూ లేరు. దీనికంతటికీ కృష్ణుడే కారణమని భావించి అందరూ అతనిని నిందించారు. ఇంతలో కృష్ణుడు చిరునవ్వుతో అక్కడికి వచ్చి, "పాండవులారా! తొందరపాటు మంచిది కాదు. శాంతం వహించండి", అంటూ వారిమధ్యనే కూర్చున్నాడు. ఆ బిడ్డను తీసుకు రమ్మని ద్రౌపదిని ఆజ్ఞాపించాడు. మరణించినటువంటి బిడ్డను ఒక చిన్న తట్టలో పెట్టుకొని ద్రౌపది అక్కడికి తీసుకు వచ్చింది. అప్పుడు కృష్ణుడు, "ఆహా! ఆ ముక్కు చూడు, ఆ చెవులు చూడు, ఆ నోరు చూడు. అంతా అభిమన్యుని పోలికే!", అని వర్ణిస్తూ వచ్చాడు. మరణించిన శిశువును ఇంతగా వర్ణిస్తున్నాడేమిటని పాండవులకు కోపం వచ్చింది. "అవునవును, శ్వాస కూడా అభిమన్యుని శ్వాసను పోలి ఉంది", అన్నారు. అప్పుడు కృష్ణుడు ఆ బిడ్డను తన చేతిలోకి తీసికొని పిఱ్ఱలపైన, బొజ్జపైన తట్టాడు. బిడ్డ కెవ్వుమని ఏడ్చాడు. కృష్ణుడు పరీక్షించి ప్రాణమిచ్చినాడు కనుకనే, ఆ పిల్లవానికి 'పరీక్షిత్తు' అని పేరు పెట్టారు. పరీక్ష లేకుండా పాసై పైక్లాసులకు పోవటానికి ఎవ్వరికీ వీలుకాదు. భగవంతుడు పరీక్ష చేస్తూనే ఉంటాడు. భగవంతుడు పెట్టే 'టెస్టు'ను మనం 'టెస్టు'గా భావించకూడదు. ఆ 'టెస్టే' మనకు 'టేస్టు'గా ఉండాలి. భగవంతుడు పెట్టే పరీక్షలన్నీ చక్కని 'టేస్టు'తో కూడినటువంటివే!

**ఎవరు చేసిన కర్మ వారనుభవింపక తప్పదు**

కృష్ణునివెంట ద్వారకకు వెళ్లిన అర్జునుడు తిరిగి వచ్చాడు. 'నాయనా! కృష్ణుడు బాగున్నాడా?' అని అడిగింది, కుంతీదేవి. అప్పటికి కృష్ణుడు నిజ ధామమున కేగినాడు. 'అమ్మా! కృష్ణుడు మనకిక లేడు', అంటూ అర్జునుడు భోరున విలపించాడు. ఆ వార్త వింటూనే కుంతీదేవి ప్రాణం విడిచింది. "కృష్ణుడే మా ప్రాణము. కృష్ణుడే మా దైవము. కృష్ణుడు లేని జీవితము మాకెందుకు!" అని భావించి పాండవులు హిమాలయాలకు బయల్దేరాలని నిర్ణయించుకున్నారు. కుంతికి అంత్యక్రియలు నిర్వహించి, పరీక్షిత్తుకు పట్టం కట్టి పాండవులు ఉత్తరదిశగా బయలుదేరారు. ఇవన్నీ ఒకేరోజున జరిగాయి! ఏ

srisathyasai vahamrutam

రాజ్యమునందూ, ఏ కాలమునందూ ఇటువంటి ఘట్టము మరొకటి జరుగ లేదు. ధర్మజుడు ముందు నడిచాడు. అతని వెనుక భీమార్జున నకుల సహదేవులు నడిచారు. వారి వెనుక ద్రౌపది నడిచింది.

**'ఎవరు చేసిన కర్మ వారనుభవింపక**
**ఏరికైనను తప్పదన్నా!**
**ఏనాడొ ఏతీరొ ఎవరు చెప్పాగలరు?**
**అనుభవించుట సిద్ధమన్నా!'**

మార్గమధ్యంలో ద్రౌపది, భీమార్జున నకుల సహదేవులు కూలిపోయారు. ధర్మరాజు ఒంటరిగా ప్రయాణం సాగించాడు. అతను ఏనాడూ అసత్యమాడినటు వంటివాడు కాదు. కాని, మహాభారత యుద్ధ సమయంలో 'అశ్వత్థామ హతః కుంజరః' అని చెప్పాడు. 'అశ్వత్థామ' అనే ఏనుగు చచ్చిపోయింది అని దీని అర్థం. కాని, ధర్మజుడు ద్రోణునికి వినిపించేటట్లుగా 'అశ్వత్థామ హతః' అని గట్టిగా పలికి 'కుంజరః' అనే పదాన్ని మెల్లగా చెప్పాడు. వెంటనే ద్రోణుడు తన కుమారుడు మరణించాడనుకొని అస్త్రసన్యాసం గావించి ప్రాణత్యాగం చేశాడు. ఈవిధంగా అసత్యం పలికి ద్రోణుని మరణానికి కారకుడై పాపానికొడిగట్టడంచేత ధర్మజుడు కొద్దిసేపు నరకంలో ఉండవలసి వచ్చింది. 'నిరంతరం ధర్మమును అనుసరించిన ధర్మరాజంతటివానికి కూడా నరకప్రాప్తి కలిగిందా', అని లోకులు అనుకోవచ్చు. కర్మఫలితాన్ని ఎవరైనా సరే, అనుభవించక తప్పదు. ధర్మరాజు నరకంలో ఉన్న సమయంలో ద్రౌపది, భీమార్జున నకుల సహదేవులు కూడా అక్కడే ఉన్నారు. పంచపాండవులు ధర్మస్వరూపులు. కనుకనే, వారు నరకంలో ఉన్నంత సేపు అక్కడ శిక్ష అనుభవిస్తున్నవారు చాలా సుఖాన్ని అనుభవించారు. వాళ్లంతా పోయి ధర్మజుని పాదాలపై పడి, 'మీరింకా కొంతకాలం ఇక్కడే ఉంటే మాకెంతో సుఖంగా ఉంటుంది', అన్నారు. అప్పుడు ధర్మజుడు, 'నాయనలారా! నేనిక్కడ ఉండటానికి వీల్లేదు. నరక లోకాధిపతి నన్నిక్కడినుండి పంపించివేస్తున్నాడు', అన్నాడు. ఆ తరువాత పాండవులు, ద్రౌపది స్వర్గానికి వెళ్ళిపోయారు.

srisathyasaivachanamrutam

### ద్రౌపదికి సాటి ఏ పతివ్రతయు లేదు

చూశారా! ధర్మస్వరూపులు, పుణ్యమూర్తులు అయిన పాండవులకే కర్మఫలితమును అనుభవింపక తప్పలేదు. ద్రౌపది మహాపతివ్రత. 'ఈ లోకంలో అందరికంటే గొప్ప పతివ్రత ఎవరు?' అని ఒకరు ప్రశ్నించగా కృష్ణుడు చెప్పాడు,

**"పతుల పలుమాటలకు ఎదురు చెప్పంగబోదు**
**వారి సేవలు చేయగా తీరదనదు**
**తనకున్నదానిచే తృప్తి గనుచునుండు**
**ద్రౌపదికి సాటి ఏ పతివ్రతయు లేదు"**

అంతటి మహాపతివ్రతయైన ద్రౌపదికూడా ఇన్ని అవస్థలకు గురి అయింది. ఈ కాలంలో భార్యకు తన భర్త మాట వినడం చాలా కష్టంగా ఉంటుంది. కాని, ద్రౌపదికి ఒక్కరు కాదు, ఐదుమంది భర్తలు. ఆమె ఆ ఐదుగురి మాటలనూ చక్కగా అనుసరిస్తూ వచ్చింది. వారి సేవలు చేస్తూనే ఉన్నది. 'తనకున్నదానిచే తృప్తి గనుచునుండు'. భర్తకు నూరు రూపాయల జీతం వస్తుంటే, 'నాకు ఇన్నూరు రూపాయల చీర కావాలి' అని మొండిపట్టు పట్టే ఆడవారుకూడా ఉంటారు. కాని, ద్రౌపది అటువంటిది కాదు. తనకు ఉన్నదాంట్లో తృప్తి పడుతూ వచ్చింది. ఈ మూడు గుణములచేత ద్రౌపది గొప్ప పతివ్రతగా ఖ్యాతి గాంచింది.

మానవునియొక్క గౌరవము తాను చేసే చిన్నచిన్న పనులపైకూడను ఎంతో ఆధారపడి ఉంటుంది. ప్రతి మానవునికి కర్మలయందు అనేక దోషములు ఏర్పడుతుంటాయి. ఏ దోషము ఏర్పడినప్పటికీ దాని యొక్క ప్రతిఫలము తప్పినది కాదు. కాబట్టి, సత్యాన్ని పలుకుతూ, ధర్మము ప్రకారం నడుచుకుంటూ, ప్రేమతో జీవితాన్ని గడపడమే మానవుని కర్తవ్యం. సత్య, ధర్మ, శాంతి, దయ, ప్రేమలు లేని మానవుడు జీవచ్ఛవంతో సమానం. వీటిని మానవుడు తన పంచప్రాణములుగా భావించాలి. తమాషాకుకూడను మనము అసత్యమాడ కూడదు. ఎవ్వరినీ గేలి చేయకూడదు. పరదూషణ మహాపాపం. 'పరులను దూషించుటకంటె పాపమున్నె?' కాబట్టి, ఎటువంటివారినైనా మనము దూషించ కూడదు. అందరినీ ప్రేమించాలి. ప్రేమయే దైవం, దైవమే ప్రేమ. ప్రేమయే ప్రాణము.

srisathyasaivachanamrutam

(స్వామి విద్యార్థులచేత 'లవ్ ఈజ్ మై ఫామ్, ట్రూత్ ఈజ్ మై బ్రెత్...' అనే పాట పాడించారు)

ప్రేమను పెంచుకోండి. 'అడవులయందున్న ఆకసముననున్న పట్టణమున నున్న పల్లెనున్న గుట్ట మీదనున్న నట్టేట పడియున్న ఎక్కడున్నను మీ ప్రేమయే మిమ్మల్ని కాపాడుతుంది. మీ శత్రువుని సహితం ప్రేమించండి. వాడు కనిపిస్తే మొహం తిప్పుకోవద్దు. 'హలో బ్రదర్, హౌ ఆర్ యు?' అని ప్రేమతో పలుకరించండి. ప్రేమతో, ధైర్యంతో, ఉత్సాహంతో జీవితాన్ని గడపండి. అప్పుడే మీ మానవత్వము దివ్యత్వంగా మారుతుంది. ప్రేమను పెంచుకొమ్మని మనము అందరికీ బోధించాలి. అదియే ఈనాడు నేనందించే ప్రధాన సందేశం.

**(తేదీ 15.8.2006 అతిరుద్ర మహాయజ్ఞం, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasai vachanamrutam